ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 8 ఏప్రిల్ 2024





ఇఫ్తార్	సోమవారం సాయంత్రం	06:34
సెహరీ	మంగళవారం ఉదయం	04:52

"ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాలకు ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర అన్యాయం జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా వర్గాల అభివృద్ధికి ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలయ్యాయి. మసీదులు, చర్చిలు, షాదీఖానాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి."

- అనంతపురం ప్రెస్‌క్లబ్



ఉరవకొండలో నిధులు కేటాయించక పోవడంతో అర్ధంతరంగా ఆగిన షాదీఖానా

ఉత్తుత్తి ప్రేమ...!

ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమంపై నిర్లక్ష్యం

- ఊసేలేని ప్రార్థనలు, వేడుకల నిర్వహణ భవన నిర్మాణాలు
- టీడీపీ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం
- వైసీపీ పాలనలో తీవ్ర అన్యాయం .. మండిపడుతున్న మైనార్టీ వర్గాలు

టీడీపీ హయాంలో నిధుల జాతర

తెలుగుదేశం పార్టీ పాలనలో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. టీడీపీ ఐదేళ్ల పాలనలో మసీదులు, షాదీఖానాలు, చర్చిల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి నియోజకవర్గానికి, మండలానికి, గ్రామానికి భవనాలు కేటాయించి, రూ.కోట్లల్లో నిధులు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మసీదుల నిర్మాణాలకు 238 దరఖాస్తులు వస్తే అన్నింటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, రూ.16.06 కోట్లు విడుదల చేసింది. షాదీఖానాల కోసం అర్జీలు పెట్టుకుంటే 47 భవన నిర్మాణాలకు రూ. 10.53 కోట్లు విడుదల చేసింది. 116 చర్చిల నిర్మాణాల కోసం రూ. 3.52 కోట్లు నిధులు విడుదల చేసింది.



యాడికిలో నిరుపయోగంగా ఉన్న షాదీఖానా

వైసీపీ హయాంలో ఒక్క భవనం నిర్మించని వైనం..

వైసీపీ అధికారంలోకి వచ్చాక ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించింది. షాదీఖానాలు, మసీదులు, చర్చిలు నిర్మిస్తామని హామీలిచ్చిన ఆ పార్టీ ప్రజాప్రతినిధులు వాటిని నిలబెట్టుకోలేకపోయారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క షాదీఖానాగానీ... ఒక్క మసీదుగానీ... ఒక్క చర్చి నిర్మించిన దాఖలాలు లేవు. సంబంధిత శాఖ అధికారుల లెక్కల మేరకు చర్చిలు, మసీదులు, షాదీఖానాల నిర్మాణాల కోసం వందల్లో దరఖాస్తులు వచ్చినప్పటికీ అవన్నీ చెత్తబుట్టలకే పరిమితమయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. ఏదైనా మసీదు, చర్చి, షాదీఖానా నిర్మించాలంటే ప్రభుత్వ భూమిని ఎంపిక చేయాలి. అనంతరం ఆ భూమిని స్థానిక ఎమ్మెల్యే, తహసీల్దార్ తదితర అధికారులు పరిశీలించి ఆమోద ముద్ర వేసి, మైనార్టీ సంక్షేమ శాఖ, వక్ఫ్‌బోర్డుకు పంపించాల్సి ఉంటుంది. అయితే గడచిన ఐదేళ్లల్లో ఒక్క ఎమ్మెల్యే అటువైపు అడుగులేసిన దాఖలాలే లేవు.

టీడీపీకి పేరొస్తుందనే...

టీడీపీ హయాంలో నిర్మాణ దశలో ఉన్న వాటిపై కూడా వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం కనబరించింది. ఉదాహరణకు ఉరవకొండలో రూ.50 లక్షలతో షాదీఖానా నిర్మాణం చేపట్టారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం మొదటి విడతగా రూ.25 లక్షలు విడుదల చేసింది. దీంతో పిల్లర్లు, స్లాబ్‌ల వరకూ నిర్మాణం చేపట్టారు. తర్వాత వైసీపీ అధికారం లోకి రావడంతో మిగిలిన నిధుల విడుదల విషయంలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో ఆ షాదీఖానా నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. శింగనమలలో రూ. 15 లక్షలతో షాదీఖానాను నిర్మించారు. మౌలిక వసతులు, చుట్టూ విశాలమైన గ్రౌండ్‌లో నిర్మించారు. అయితే ఆ షాదీఖానాను వినియోగంలోకి తీసుకురాకుండా వైసీపీ అడ్డుకుంది. యాడికిలో కూడా రూ. 20లక్షలతో నిర్మించిన షాదీఖానాను వినియోగం లోకి తీసుకురాకుండా అడ్డు తగిలినట్లు సమాచారం. ఇలా ఎటుచూసినా వైసీపీ ప్రభుత్వం టీడీపీ పాలనలో నిర్మించిన వాటిని వినియోగంలోకి రాకుండా అడ్డుకుంది. టీడీపీకి మంచి పేరు వస్తుందనే ఇలా అడ్డుతగిలినట్లు మైనార్టీ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పక్కప్రాంతాల్లో ప్రార్థనలు, పెళ్లిళ్లు...

ఉమ్మడి జిల్లాల్లో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు అధికంగా ఉన్న చోట షాదీఖానాలు, మసీదులు, చర్చిలు లేకపోవడంతో ఆ వర్గాలు ఇతర ప్రాంతాలకు వచ్చి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. ప్రార్థనల కోసం పదుల కి.మీ ప్రయాణం చేస్తున్నారు.



శింగనమలలో షాదీఖానా పూర్తయినా... వినియోగంలోకి తీసుకురాని వైనం

తీరని అన్యాయం: మహబూబ్ బాషా, ఐఎంఎం వ్యవస్థాపక అధ్యక్షుడు



ఉమ్మడి జిల్లాలోని ముస్లిం మైనార్టీకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. వైసీపీ ఏదో మేలు చేస్తుందనుకొని 2019లో గెలిపిస్తే... ఐదేళ్లుగా ముస్లిం మైనార్టీలను అణచివేసే ధోరణిని ప్రదర్శించింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ముస్లిం మైనార్టీలకు ఉపయోగం లేని నామినేటెడ్ పదవులు కట్టబెట్టి చేతులు దులుపుకుంది. ఒక్కటంటే ఒక్క షాదీఖానా, మసీదు నిర్మించకుండా అన్యాయం చేసింది.



సమీక్షలో పాల్గొన్న ఎస్పీ అమిత్ బర్దర్

సమర్థవంతంగా పని చేయండి

జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం గుంతకల్లు సబ్‌డివిజన్ సీఐలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద, లాడ్జిలు, డాబాలలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. వాహనాల తనిఖీలు తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంత ఎన్నికల కోసం సబ్ డివిజన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటనలు, ప్రస్తుతం ఆ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను ఎస్పీ సమీక్షించారు. సమావేశంలో డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐలు రామసుబ్బయ్య, గణేష్, మహేశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్

- ద్విచక్రవాహనదారుడి సజీవదహనం



కాలిపోయిన వాహనం

పెద్దవడుగూరు, ఏప్రిల్7: మండలంలోని వీరేపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నరేష్ (40) ద్విచక్రవాహనం సహా దగ్ధమైపోయాడని పోలీసులు తెలిపారు. గుత్తి వైపు నుంచి వస్తున్న లారీ మరమ్మతులకు గురికావడంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. అదే సమయంలో పెద్దపప్పూరు మండలం తురకపల్లి గ్రామానికి చెందిన నరేష్ గుత్తి నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. అయితే మార్గమధ్యంలో వీరేపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టి కిందపడ్డాడు. వెంటనే ద్విచక్రవాహనం నుంచి పెట్రోలు లీకై వేడికి మంటలు వ్యాపించాయి. దీంతో ద్విచక్రవాహనంతో పాటు నరేష్ కాలిపోయారు. మృతుడి పూర్తి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

కసాపురంలో మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 7: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా మన్యుసూక్త హోమం నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో వేదపండితులు, అర్చకులు ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చారు. ఉత్సవ మూర్తికి అభిషేకం చేసి మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు (ఆది)	
గరిష్ఠం	43.0
కనిష్ఠం	27.0

ఎలా చేస్తారో?

కొత్త కలెక్టరుకు అనంత ఎన్నికలు సవాలే !

- గెలుపు కోసం అధికారపార్టీ అడ్డదారులు
- కోడ్ వచ్చినా మారని కొందరు అధికారులు, ఉద్యోగులు
- కొన్ని నియోజకవర్గాల్లో బరితెగించిన వైసీపీ నాయకులు
- అక్రమాలకు అడ్డుకట్ట పడేనా?

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కొత్త కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్‌కు ఓ సవాల్‌గా మారనుంది. అధికార వైసీపీ ఎలాగైనా మళ్లీ అత్యధిక స్థానాల్లో గెలవాలని వ్యూహాత్మకంగా అడ్డదారుల్లో వెళుతోంది. అందుకే ఆ పార్టీ నాయకులు గత ఆరు నెలలుగా వివిధ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను సైతం తుంగలో తొక్కి, ఓటరు జాబితా తయారీలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు మూటగట్టుకున్నారు. ఎందరికో డబుల్, త్రిబుల్ ఎంట్రీ ఓట్లు నమోదు చేయించుకున్నారు. బోగస్ ఓట్లు లెక్కలేనన్ని చేర్చారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఎన్నికల పర్యవేక్షణ అధికారులతో పాటు బీఎల్‌ఓలను బెదిరించి అక్రమాలకు పాల్పడ్డారు. ఓటర్ల ఫిర్యాదులకు సంబంధించి 6,7,8 ఫారంలు జిల్లాలో 1,38,514 వచ్చాయంటే ఇక్కడ ఏ స్థాయిలో అవకతవకలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా ఫారం-7పై అధికార వైసీపీ నేతలు అనేక అక్రమాలకు పాల్పడుతూ ప్రతిపక్ష టీడీపీ ఓట్లను తొలగించేందుకు కుట్రలు పన్నుతూ వచ్చారు. వీటికి అధికారులు అడ్డు చెప్పకపోవడంతో వైసీపీ అక్రమాలకు అంతులేకుండా పోయిందన్న వాదనలు వినిపిస్తూ వచ్చాయి. అందుకే టీడీపీ నాయకులు ఓటరు జాబితాలో అక్రమాలపై జిల్లా నుంచి సెంట్రల్ వరకు పోరాటం సాగిస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఇక్కడ పనిచేస్తున్న కలెక్టరు గౌతమిపై బదిలీ వేటు వేసింది. ఆస్థానంలో డాక్టర్ వినోద్‌కుమార్ నియమించింది. ఇపుడు అందరూ ఈకొత్త కలెక్టరు పనితీరు ఎలా ఉంటుందోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్

కోడ్ వచ్చినా అంతే..!

ఎన్నికల కోడ్ వచ్చినా ఇంకా జిల్లాలో కొన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు మారలేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికీ అధికార వైసీపీ నేతల కనుసన్నల్లో పలువురు పని చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ, డీఆర్‌డీఏ, డ్వామా, పంచాయతీ రాజ్ శాఖకు చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో అంటకాగుతున్నారనే విమర్శలు ఉన్నాయి. సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు వ్యవహారం ఈఎన్నికలలో పెద్ద వివాదాస్పదంగా మారింది. టీడీపీ నాయకులు కూడా అనేక అక్రమ వ్యవహారాలపై ఆధారలతో ఫిర్యాదులు చేస్తూ, వైసీపీ ఆగడాలకు ఆగడాలకు అడ్డుకట్టు వేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా ముఖ్యంగా రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాలలో మరీ బరితెగించారనే విమర్శలు ఉన్నాయి. అక్రమ వ్యవహారాలు సాగుతున్నా పాలక నేతల ఆమ్యామ్యాలు, ఒత్తిళ్లకు తలొగ్గిన కొందరు అధికారులు, ఉద్యోగులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాలలో ఎపుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనికి కారణం కొందరు అధికారులు, పోలీసుల వ్యవహారమేనన్న ప్రచారం ఉంది. ఇలాంటి పరిస్థితులలో కొత్త కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ అందరినీ అదుపులోకి తెచ్చుకుని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను సజావుగా ఎలా నిర్వహిస్తారోనని అనంత ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



ఆగిపోయిన హంద్రీనీవా పనులు

బీటీపీపై నిర్లక్ష్యం

ఐదేళ్లలో గంపెడు మట్టితీయని వైసీపీ ప్రభుత్వం

- నెరవేరని ముఖ్యమంత్రి జగన్ హామీలు
- టీడీపీ హయాంలోనే 30శాతం పనులు పూర్తి
- పైసా నిధులివ్వని ప్రస్తుత ప్రభుత్వం
- నీటి ప్రాజెక్టు అభివృద్ధిని మరిచిన వైనం

జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒక్కటైన భైరవాన్‌తిప్ప ప్రాజెక్ట్ మీద వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. టీడీపీ పాలనలో హంద్రీనీవా జలాలు బీటీపీకి మళ్లించేందుకు రూ.968 కోట్ల నిధులు మంజూరు చేసి, 30 శాతం పనులు కూడా పూర్తి చేశారు. దీనిపై అప్పటి ప్రతిపక్ష వైసీపీ తీవ్ర అవినీతి ఆరోపణలు చేసింది. టీడీపీ నాయకులు ప్రభుత్వ సొమ్ము బొక్కేందుకే రూ. 968 కోట్ల నిధులు మంజూరు చేశారని, తాము అధికారంలోకి వస్తే రూ. 150 కోట్లతోనే కృష్ణా జలాలను బీటీపీ అందిస్తామని ప్రగల్భాలు పలికింది. అయితే అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా భైరవాన్ తిప్ప ప్రాజెక్ట్‌కు కృష్ణా జలాల మళ్లింపునకు నిధులు మంజూరు చేయలేదు. పైగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో పర్యటించిన సందర్భాల్లో మూడు నెలల్లో ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు గానీ పైసా నిధులు మంజూరు చేయలేదని ఇక్కడి ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

- గుమ్మఘట్ట

గంపెడు మట్టి తీయలేని దౌర్భాగ్య ప్రభుత్వం

ఐదేళ్ల పాలనలో బీటీపీ కాలువ పనులకు గంపడు మట్టి తీయలేని దౌర్భాగ్యుడు జగన్ మోహన్‌రెడ్డి. బీటీపీకి జీడిపల్లి నీరు ఎంతో అవసరం. వచ్చే కొత్త ప్రభుత్వం ఈ పనులపై చొరవ చూపాలి.

- మల్లారెడ్డి, రైతు, కోనాపురం



నీరులేక వెలవెలబోతున్న బీటీ ప్రాజెక్ట్

నాలుగు టీఎంసీలు ఇవ్వడం లక్ష్యం

కర్ణాటక సరిహద్దున ఉన్న బీటీప్రాజెక్ట్ రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో కుడి, ఎడమ కాలువల కింద 12 వేల ఎకరాలకు సాగునీరు అందించడం. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 150 చెరువులను నీటితో నింపడమే లక్ష్యంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించింది. అందుకోసం హంద్రీనీవా కాలువ ద్వారా బీటీ ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నాలుగు టీఎంసీల నీటిని ఇవ్వాలని తలిచారు. అయితే 2019లో అధికారంలో కోల్పోవడంతో ఈ పనులు ఆగిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో అడుగు కూడా ముందుకు సాగడం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.



బీటీ ప్రాజెక్ట్

30 ఏళ్లుగా రాని నీరు

కర్ణాటక ప్రాంతం నుండి వచ్చే వరదనీటిపై ఆధారపడి ఈ ప్రాజెక్టును నిర్మించారు. అయితే కర్ణాటకలో అక్రమ ఆనకట్టల ఫలితంగా గత 30 ఏళ్లగా ప్రాజెక్టుకు వరదనీరు చేరడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు పొలాలను బీళ్లగా వదిలి కర్ణాటక ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. ఈ విషయాన్ని అప్పటి మంత్రి కాలవ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపి, ప్రాజెక్టు అభివృద్ధి కోసం రూ. 968 కోట్ల నిధులు విడుదల చేయించారు. పనులు సాగుతుండగానే ఎన్నికలు రావడం, టీడీపీ అధికారం కోల్పోవడంతో ఈ ప్రాజెక్టు అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి.

మాట ఇచ్చి మడమ తిప్పిన జగన్

మాట తప్పను మడమ తిప్పను అని చెప్పుకునే జగన్ రాయదుర్గం పర్యటనకు రెండు సార్లు వచ్చారు. అయా సందర్భాల్లో మూడునెలల్లో హంద్రీనీవా పనులు పూర్తి చేస్తామని, బీటీపీకి నీరిస్తామని ప్రజలకు మాట ఇచ్చారు. ఆ తర్వాత పనులు అడుగు కూడా ముందుకు పడలేదు.

- నేములయ్య, రైతు, కలుగోడు

మాయమాటలతో మభ్యపెట్టారు

బీటీప్రాజెక్టుకు కృష్ణజలాలు అందించడంపై గత ఎన్నికల సందర్భంగా వైసీపీ ఎన్నో హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక అవన్నీ మాయమాటలని మాకు తెలిసొచ్చింది. ఇంతకాలం ప్రజలను మభ్యపెట్టి పనులు చేయకుండా, నిధులు మంజూరు చేయకుండా కాలం గడిపేశారు. వచ్చే ఎన్నికల్లో వీరికి గుణపాఠం నేర్పుతాం.



- గొల్ల గోవిందప్ప, రైతు, కలుగోడు

పాతాళానికి గంగ

ఎండుతున్న పొలాలు

- పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- బోరుమంటున్న అన్నదాత



గోనేహాళ్ దగ్గర నీరు లేక నెర్రెలు చీలిన పొలం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7: తీవ్ర వర్షాభావం, మండు వేసవితో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. బోరుబావుల్లో నీటి మట్టాలు తగ్గిపోయాయి. దీనికి తోడు వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాన్ని కుదించడంతో మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది రబీలో బోరుబావుల కింద రైతులు వెయ్యి ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. అయితే వానలు రాకపోవడంతో బోరుబావుల్లో నీటిమట్టం వేగంగా తగ్గిపోతోంది. ఫలితంగా వరిపంటలకు నీరందక ఎండిపోతున్నాయి. నీరు అందక పొలాలు నెర్రెలు చీలుతున్నాయి. మండలంలోని శ్రీధరఘట్ట, గోనేహాళ్, కృష్ణాపురం, ఎల్‌బీనగర్ తదితర గ్రామాలలో వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిమట్టం తగ్గి బోర్లలో సన్నటి ధారలా నీళ్లు వస్తున్నాయని, రోజంతా నీళ్లు పెట్టినా పొలం తడవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అలాగే శ్రీధరఘట్ట చెరువు కింద దాదాపు 200 ఎకరాలలో వరినాట్లు వేశారు. పంటలు చేతికొచ్చే సమయంలో చెరువులో నీరు ఇంకిపోవడంతో పంటలకు నీటి తడులు ఎలా ఇవ్వాలంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేల రూపాయలు పెట్టుడులు పెట్టి సాగుచేసిన పంటలు నీరందక నిలువునా ఎండిపోతే అప్పులు కుప్ప అవుతాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండెకరాలు ఎండిపోయింది



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. రెండు వ్యవసాయ బోరు బావులు ఉన్నాయి. నాలుగు ఎకరాల్లో వరినాట్లు వేశా. కొన్ని రోజులుగా రెండు బోరుబావుల్లో నీటిమట్టం తగ్గిపోయింది. రెండెకరాల వరి పంట ఎండిపోయింది. ఇంకా కొంతమంది రైతుల బోర్లలో నీటిమట్టం తగ్గి వరిపంటలు ఎండిపోతున్నాయి. పెట్టుబడి అయినా వస్తుందో రాదోనని ఆందోళనగా ఉంది.

- ఈశ్వరప్ప, రైతు, శ్రీధరఘట్ట

పెట్టుబడి కూడా రాని పరిస్థితి



భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి. దీనికి తోడు విద్యుత్‌కోతలు ఉన్నాయి. వరిపంట ఎండిపోతోంది. పెట్టిన పెట్టుబడులు సైతం వస్తాయో రావోనని ఆందోళన కలుగుతోంది. నాలుగు ఎకరాలలో వరి పంట సాగుచేశా. ఎకరాకుపైగా నీరు అందక ఎండిపోతోంది. వరిపంటకు నీరు సరిపోక పొలంలో నెర్రెలు వచ్చాయి. మా పొలం చుట్టు పక్కల మరికొంతమంది రైతుల పంటలు ఇలాగే ఉన్నాయి. ఎకరాకు రూ. 25 వేలు చొప్పున పెట్టుబడులు పెట్టాం. పంట కోసం చేసిన అప్పులు తీరుతాయన్న నమ్మకం పోయింది.

-రవి, యువరైతు, శ్రీధరఘట్ట

విద్యార్థిని విలాపం

● గుంతకల్లు కేజీబీవీలో అక్రమాల పర్వం ● విద్యార్థినులకు సక్రమంగా అందని ఆహారం
● వంటలు వండకుండానే ఫొటోలు షేర్.. ● విచారణలో బయటపడినా చర్యలేవీ?

గుంతకల్లు, ఏప్రిల్7: పట్టణంలోని కస్తూర్బా బాలికా విద్యాలయం (కేజీబీవీ) అక్రమాలకు అలవాలంగా మారింది. విద్యార్థులకు సక్రమంగా ఆహారాన్ని అందించక పోగా, అసలు మెనూ ప్రకారం వండకుండానే వండినట్లుగా వాట్సాప్‌లో ఫొటోలు పెట్టి ఉన్నతాధికారులను బురిడీ కొట్టించారు. పులిహోర ఉంటే చట్నీలేదు, చట్నీ ఉంటే పూరీ లేకుండా ఆహారం అందిస్తున్నారు. అధికారుల తనిఖీలో అక్రమాలు బయటపడినా ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ఈ విద్యాలయంలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించగా ఇందులో పనిచేస్తున్న పీఈటీని సస్పెండ్ చేశారు. విద్యాశాఖాధికారులు ఏళ్లుగా నిర్లక్ష్యం వహిస్తున్న కారణంగా కేజీబీవీ నిర్వహణ నడి సముద్రంలో చుక్కానిలేని నావ చందంగా తయారైంది.

వంట చేయకనే ఫొటోలు..

కేజీవీబీలో బోధన బాగా ఉంటుందన్న నమ్మకంతో తల్లిదండ్రులు ఆహార నాణ్యతపై దృష్టి పెట్టలేదు. ఓ ఘటనలో విద్యాలయంలో జరుగుతున్న అక్రమాలు వెల్లడికావడంతో మరీ ఇంత ఘోరమా.. అంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు అవాక్కయ్యారు. గతనెల 31వ తేదీన కేజీబీవీలో నీటి సమస్య ఏర్పడి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారులు ఈనెల 1వ తేదీన కేజీబీవీని సందర్శించి విచారణ చేపట్టారు. విద్యార్థినులతో జీసీడీఓ మహేశ్వరి రహస్యంగా ఫిర్యాదులను సేకరించారు. అధ్వానమైన ఆహారాన్ని అందిస్తున్నారంటూ విద్యార్థులు తమ పేర్లు రాయ కుండా చీటీల్లో ఫిర్యాదులు రాసి బాక్సులో వేశారు. దీనిపై వంటవారిని, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. విద్యాలయంలో విద్యార్థులకు అసలు పూరీ వంటకాన్నే చేయకుండా చేసినట్లుగా రికార్డు చేస్తున్నట్లు వంటవారు జీసీడీఓకు ఫిర్యాదు చేశారు. పైగా విచారణ జరిగినరోజే పులిహోరలోకి చట్నీ చేసినట్లుగా చట్నీ గిన్నె ఫొటోను లొకేషన్‌తోపాటు కేజీబీవీ వాట్సాప్ గ్రూపులోకి షేర్ చేసిన విషయం బహిర్గతమైంది. పూరీ విషయంలోనూ ఇలాగే జరిగింది. ఈ తతంగం ఏళ్ల తరబడి నడుస్తున్నట్లు గుమనించారు.


గుంతకల్లు కేజీబీవీ


పనిచేయని నీటి శుద్ధి ప్లాంట్

ప్రశ్నిస్తే పోలీసులకు ఫిర్యాదు

కేజీబీవీలో జరుగుతున్న అక్రమాన్ని ఎవరైనా ప్రశ్నించాలని చూసినా, ఆకస్మికంగా విద్యాలయానికి వచ్చి వంటకాలను పరిశీలించాలని యత్నించినా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని, కేసు పెడతామంటూ బెదిరిస్తున్నారని విద్యార్థినుల తలిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యాలయ కమిటీ చైర్‌పర్సన్ నూర్జహాన్, ఆమె భర్త మార్చి 31న కేజీబీవీకి వచ్చి తాగునీటి సమస్య ఉందని గమనించారు. ట్యాంకులో నీరు అయిపోవడంతో విద్యార్థినులు ఆదివారం బట్టలు ఉతకడానికి, స్నానాలు చేయడానికి నీరు లేక అవస్థలు పడుతుండటంతో వాటర్ ట్యాంకరును తెప్పించారు. వంటగదిలోకి వెళ్లి ఆహారం ఎలా ఉందో పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తమపై పోలీసులకు ఫిర్యాదుచేశారని, పోలీసుల నుంచి తమకు ఫోన్ వచ్చిందని వాపోయారు. తల్లిదండ్రులు వచ్చినా వారిపై కేసులు పెట్టాలని చూడటం ఘోరమని ఫిర్యాదుచేశారు.

తాగునీటికి కటకట

గుంతకల్లు కేజీవీబీలో విద్యార్థినుల తాగునీటి కోసం నీటి శుద్ధి యంత్రాన్ని బిగించారు. కానీ అది లీకవుతుండటంతో ఇక్కడ తాగునీటికి సమస్యగానే ఉంటోంది. యంత్రాన్ని రన్ చేసినప్పుడు మాత్రమే తాగునీరు దొరికే అవకాశం ఉంది. ఒకవేళ కరెంట్ పోతే తాగునీళ్లు రావు..అన్నం తినే సమయంలోనూ అదే పరిస్థితి తప్పక పోవడం దారునం కేజీబీవీ నిర్వహణ ఇంత అధ్వానంగా ఉండగా, ఫిర్యాదులు తీసుకున్న ఉన్నతాధికారులు ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడం మరింత దారుణం. ఇదిలా ఉండగా తనను అవమానించారంటూ ఓ విద్యార్థిని నాలుగు రోజుల కిందట ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, విచారణ చేసిన అధికారులు పీఈటీని సస్పెండ్ చేశారు.

అన్నం బాగా లేకపోయినా ఊరుకున్నాం : చైర్‌పర్సన్ నూర్జహాన్



కేజీబీవీలో అన్నం సక్రమంగా ఉడక్క విద్యార్థినులు అవస్థలుపడుతు న్నా, చదువులు బాగా ఉంటాయన్న ఒకే ఒక్క కారణంగా తల్లిదండ్రులము ఊరికే ఉన్నాము. నీరు కూడా ఇవ్వలేరా అని ప్రశ్నించినందుకు అనుమతి లేకుండా లోనికి వస్తున్నారంటూ మాపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిల్లలకు ఆహారాన్ని ఇవ్వకుండా ఇచ్చినట్లుగా రికార్డులు రాయడం మరీ ఘోరం దీనిపై చర్యలు తీసుకోవాలి.

హలీంకు అనంత సలాం..!



● రంజాన్ నెలలో అత్యంత ప్రీతికరమైన వంట ● నెలరోజులుగా కిటకిటలాడిన హోటళ్లు ● రుచితోపాటు ఆరోగ్యం..

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్7 : రంజాన్ అంటేనే గుర్తుకొచ్చే వంటకాల్లో ముఖ్యమైనది హలీమ్. నెలరోజులుగా హలీం సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. రంజాన్ ఉపవాసం ముగియగానే ముస్లింలు హలీమ్ తినడం ఆనవాయితీ. అయితే హలీమ్ రుచులకు అన్నివర్గాలు దాసోహం అయ్యాయి. చికెన్, మటన్‌లతో తయారు చేసే ఈ వంటకానికి అంత క్రేజ్ ఉంది. మహానగరాలకే పరిమితమైన ఈ వంటకం రానురానూ అన్ని ప్రాంతాలకు విస్తరించి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. నగరంలోని మెహ్ఫిల్ రెస్టారెంట్, స్పెషల్ అరబ్ జఫ్రానీ హలీమ్, సుభాష్‌రోడ్డులోని పలు సెంటర్ల నిర్వాహకులు ప్రత్యేకంగా హైదరాబాద్, అరేబియన్ వంట మాస్టర్లను పిలిపించి మరీ రెస్టారెంట్, హలీం సెంటర్ల నిర్వాహకులు తయారు చేయిస్తుండంతో ఆ రుచులకు ఆహార ప్రేమికులు దాసోహం అవుతున్నారు.


హలీం సెంటర్ వద్ద జనం కిటకిట..

హలీం ఎలా మొదలైంది..?

రంజాన్ మాసంలోనే లభించే అత్యంత రుచికరమైన వంటకమిది. ఈ వంటకాన్ని అరేబియన్స్ ప్రజల ముందుకు తీసుకొచ్చారు. ఈ హలీంకు హరీస్ అని మరో పేరు ఉంది. 10వ శతాబ్దంలో కితాబ్ అల్ తబిక్‌లో హలీమ్ రెసిపి గురించి తొలిసారిగా రాశారు. హైదరాబాద్ నిజాం ఆర్మీ దగ్గర ఉండే అరేబియన్ సైన్యం మొట్టమొదటి సారిగా భారత్‌లోకి తీసుకొచ్చినట్లు సమాచారం. అప్పటి నుంచి ప్రతి రంజాన్ మాసంలో హలీమ్ ప్రతి రెస్టారెంట్లలో తయారు చేయడం మొదలుపెట్టారు. ఒకప్పుడు మహానగరాల్లో లభించే ఆ హలీం ప్రస్తుతం అన్ని చోట్లా లభిస్తోంది.


చికెన్ షేర్వా తయారీ..

తయారీ విధానం...

హలీం తయారీలో అత్యధిక పోషకాలు కలిగిన డ్రై ఫ్రూట్స్‌తో పాటు చికెన్, మటన్, ఆరోగ్యానికి హానికరం కాని మసాల దినుసులను వాడతారు. చికెన్, మటన్‌లతో పాటు గోధుమలు, నెయ్యి, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, శనగపప్పు, మినపప్పు, ధనియాలు, జీలకర్ర, వాము, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, నల్ల మిరియాలు, కుంకుమ పువ్వు, బెల్లంతో పాటు డ్రై ఫ్రూట్స్ పిస్తా, జీడిపప్పు, అంజీరా, బాదం పప్పు, కొత్తిమీర, ఫ్రైడ్ ఉల్లిపాయలు, నిమ్మకాయల కలయికలతో ఈ హలీం తయారు చేస్తున్నారు. గోధుమలు, పప్పులు రాత్రంతా నానబెట్టి బాగా ఉడికించుకుంటారు. మటన్, చికెన్‌ను ఖైమాలాగా చేసుకొని ఉడికించుకొని... అన్ని రకాల మసాలా వేసి గ్రేవీ మాదిరిగా తయారు చేస్తారు. వీటిలో గోధుమలు, పప్పుల మిశ్రమం, ఉడికించుకున్న చికెన్, మటన్‌లను గ్రేవీలో వేసి దాదాపు 6 నుంచి 7 గంటల వరకూ వరకూ గుమగుమలాడే సువాసనలు వచ్చేవరకూ ఉడికించి తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు.

ఐదేళ్లుగా హలీం తయారు చేస్తున్నాం... : తాజుద్దీన్, మెహ్ఫిల్ హలీమ్ సెంటర్



ప్రతి రంజాన్ మాసంలో నగర ప్రజల కోసం చికెన్, మటన్ హలీం తయారు చేయిస్తున్నాం. వీటితో పాటు చికెన్ షవర్మా, చికెన్ స్పెషల్ తందూరీ ఐటమ్‌లను అందజేస్తున్నాం. వీటి తయారీకోసం హైదరాబాదు నుంచి వంటమాస్టర్లను రప్పిస్తున్నాం. అనంతలో బాగా ఆదరిస్తున్నారు.

జఫ్రానీ హలీం పరిచయం చేశాం... : ఆరీఫ్, స్పెషల్ అరబ్ జఫ్రానీ హలీం సెంటర్



హలీంలో జఫ్రానీ హలీమ్‌కు క్రేజ్ ఉంది. వీటితో వాడే మసాల దినుసులు, డ్రై ఫ్రూట్స్‌ను హైదరాబాద్ నుంచి తెప్పించి తయారు చేయిస్తున్నాం. అనంతలో మొదటిసారిగా జఫ్రానీ హలీం ప్రజల ముందుకు తీసుకొచ్చాం. వీటి కోసం ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. అద్భుతమైన రుచితోపాటు ఆరోగ్యం లభిస్తోంది.

మున్సిపల్ కమిషనర్ వీరంగం..!


మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్

రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 7: పట్టణంలోని ఆరో వార్డులో మున్సిపల్ కమిషనర్ కిషోర్ ఆదివారం వీరంగం సృష్టించారు. ఆ వార్డు మహిళలు తెలిపిన వివరాలివి. ఐదురోజులుగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామనీ, సమస్యను పరిష్కరించాలని కోరిన మహిళలపై మున్సిపల్ కమిషనర్ కిషోర్ దూషణకు దిగారు. తాగునీటి విషయంలో రాజకీయం చేస్తున్నారంటూ మహిళలపై మండిపడ్డారు. కేసులు బనాయించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి సమస్యను ఎదుర్కొంటున్న విషయాన్ని ఆరో వార్డు ప్రజలు ముందుగా కౌన్సిలర్ మంజునాథ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నీటి ట్యాంకర్‌ను తెప్పించారు. నీళ్లు సామాన్య ప్రజలకు అందకుండా మున్సిపల్ చైర్మన్ పొరాళు శిల్ప బంధువులు ఆ వార్డులో ఉండడంతో వారికి తొలి ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ఆ వార్డు మహిళలు ఆందోళనకు దిగారు. ఇంతలోనే మున్సిపల్ కమిషనర్ కిషోర్ అక్కడికి చేరుకున్నారు. మద్యం మత్తులో ఆయన తమపై అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు వీరంగం సృష్టించారని మహిళలు ఆరోపించారు.

మూల్యాంకనం బకాయిలు వెంటనే చెల్లించాలి

అనంతపురం విద్య, ఏప్రిల్ 7: మూల్యాంకనం ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించాలని ఫోర్టో నాయకులు.. అధికారులను కోరారు. పదో తరగతి స్పాట్ కేంద్రంలో ఆదివారం డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్‌నాయక్‌ను వారు సన్మానించారు. ఫోర్టో రాష్ట్ర చైర్మన్ హరికృష్ణ మాట్లాడుతూ... ఈ ఏడాది మూల్యాకనం డబ్బుతోపాటు, గతేడాది పెండింగ్‌లో ఉంచిన సొమ్మును వెంటనే టీచర్లకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ స్పందిస్తూ... త్వరితగతిని మూల్యాంకనం బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, ఫోర్టో నాయకులు ఆదిశేషయ్య, లక్ష్మీనారాయణ, ఈరాలప్ప, వేణుగోపాల్, వెంకటరమణ, రాఘవేంద్ర, ఖాజావలి, మహబూబ్ బాషా, రవీంద్ర, పెద్దన్న, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేష్ పాల్గొన్నారు.

అడ్డదారిలో అయ్యవార్లు..!



● వైసీపీకి అనుకూలంగా వ్యవహారాలు ● ఆ పార్టీ అభ్యర్థులకు ఓటేయాలంటూ కొందరు నేతల వ్యూహాలు ● హైవే డాబాలో ఇటీవల గురువులకు విందు... మందు..

అనంతపురం విద్య, ఏప్రిల్ 7 : జిల్లాలో కొందరు అయ్యవార్లు అడ్డదారి పట్టారు. వైసీపీని మరోసారి అధికారంలోకి తేవడానికి బరితెగిస్తున్నారు. 10వతేదీ వచ్చినా జీతాలు వేయకున్నా... ఏపీ చరిత్రలోనే ఉపాధ్యాయులకు అందించేతో జీతాల్లో కోత పెట్టినా, హెచ్ఆర్ఏలు తగ్గించినా..., డీఏలు ఇవ్వకున్నా.... ఉపాధ్యాయులను అనేక రకాలుగా వేధించినా....జగన్ సర్కారును మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు కొందరు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు నానా అవస్థలు పడుతున్నారు. వ్యూహాత్మకంగా రాజకీయ విందులు ఏర్పాటు చేస్తున్నారు. మొదట అందరం కలుద్దాం అంటూ ఉపాధ్యాయులను రాజకీయ విందులకు పిలుస్తున్నారు. అందరూ సమావేశమయ్యాక... సమావేశం ముగింపు దశకు చేరుకోగానే...ఉన్నఫలంగా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలను, ఇతర ప్రజాప్రతినిధులను దించుతారు. వాళ్లు వచ్చి కూర్చోగానే.... మనవాళ్లను గెలిపించండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. గత కొంతకాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొందరు వైసీపీ అనుకూల ఉపాధ్యాయులు, వైఎస్ఆర్‌సీపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు చేస్తున్న విందు రాజకీయం ఇదీ.

మందేసి.. చిందేసి..

ఇటీవల అనంతపురంలోని జాతీయ రహదారిలోని ఓ డాబాలో ఏర్పాటు చిసన విందుకు చాలా మంది ఉపాధ్యాయులకు ఆహ్వానం పంపారు. అయితే అధిక శాతం అధికార వైసీపీ సామాజికవర్గం ఉపాధ్యాయులు, సంఘాల నాయకులే హాజరయ్యారు. వైసీపీ అనుబంధ టీచర్స్ సంఘం నాయకులు, వైసీపీతో అంటకాగే మరో ఉపాధ్యాయ సంఘం నాయకులు ముం దుండి వేడుకను నడిపించారు.. ముక్కలతోపాటు, చుక్కలు కూడా ఉపాధ్యాయులకు సరఫరా చేశారట. బాగా తిన్న తర్వాత కొందరు ఉపాధ్యాయులు మందేసి చిందులు కూడా తొక్కారట. ఒక్కసారిగా తమ సామాజికవర్గం వారిని అందరినీ చూడటంతోపాటు, ఫూటుగా తాగడంతో... కైపు ఎక్కువైన కొందరు ఉపాధ్యాయులు డ్యాన్సులు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పార్టీలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకుడిగా చెప్పుకునే ఓ పీడీ, కొందరు ప్రధానోపాధ్యాయులు, టీచర్లు కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులై ఉండి డాబాల్లో తప్పుతాగి...ఇలా డ్యాన్సులు చేసి ఏం మెసేజ్‌లు ఇద్దామని, వీళ్లు ఇలా చేశారంటూ...పలువురు ఉపాధ్యాయులు వాళ్ల చేష్టలు గురించి చెప్పుకుని పెదవి విరుస్తున్నారు. ఈ ఐదేళ్లల్లో జగన్ సర్కారులో ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేశారని, తీరా ఇప్పుడు మళ్లీ...ఆ పార్టీ నేతలకు ఓట్లు వేయాలంటూ...కొందరు ఉపాధ్యాయులు వంతుపాడుతూ...విందులు చేయడంపై సగటు ఉపాధ్యాయులు మండి పడుతున్నారు. జిల్లావిద్యాశాకాధికారులు ఇప్పుడు డిన్నర్ రాజకీయాలపై విచారణకు దిగారు. దీంతో ఎలాగైనా క్రమశిక్షనా చర్యల నుంచి తప్పించుకోడానికి ఆ ధికారులపై ఒత్తిళ్లు కూడా తెస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.



పట్టుచీరల పట్టివేత


తనిఖీల్లో పట్టుబడిన బిల్లులు లేని పట్టుచీరలు

రొద్దం, ఏప్రిల్ 7: కర్ణాటక ప్రాంతం నుంచి బిల్లులు లేకుండా తీసుకొస్తున్న పట్టు చీరలను మండలంలోని ఆర్.మరువపల్లి చెక్‌పోస్టులో అధికారులు పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం వైఎస్ హొసకోట ప్రాంతానికి చెందిన బాలాజీ అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం 96రేషం చీరలు కారులో పావగడ వైపు నుంచి పెనుకొండ వైపుకు తరలిస్తుండగా చెక్‌పోస్టులు అధికారులు తనిఖీ చేశారు. బిల్లులు చూపకపోవడంతో చీరలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. చీరలను సీజ్ చేశారు. పట్టు చీరలను పుట్టపర్తి ట్రెజరీ కార్యాలయంలో భద్రపరిచినట్లు రీసర్వే డీటీ చంద్రశేఖర్ తెలిపారు. వాహన తనిఖీల్లో రాము, అనిల్‌కుమార్, పోలీసు సిబ్బంది మారుతి తదితరులు పాల్గొన్నారు.


బిల్లులు లేని పట్టుచీరలతో పోలీసులు, రెవెన్యూ అధికారులు

ఇంకా ఎన్నాళ్లకో..?

● నేటికీ అందని ఆసరా సొమ్ము
● రెండున్నర నెలల కిందట బటన్ నొక్కిన సీఎం
● అకౌంట్లలో జమకాని నగదు
● పొదుపు మహిళల అసహనం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 7: దాదాపు రెండున్నర నెలలు దాటినా ఆసరా సొమ్ము అందక అక్క చెల్లెమ్మలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనవరి 23న డ్వాక్రా పొదుపు సంఘాల్లోని మహిళలకు ఆసరా సొమ్ము చెల్లిస్తున్నట్లు బటన్ నొక్కారు. నేటికీ ఆ సొమ్ము మహిళల ఖాతాల్లో జమకాలేదు. దీంతో ముఖ్యమంత్రి బటన్ నొక్కడం అంతా ఉత్తదే అని ఆ పొదుపు సంఘాల్లోని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డీఆర్‌డీఏ-వైకేపీ అధికారుల ఆన్‌లైన్ వెబ్‌సైట్ రికార్డుల ప్రకారం ఇప్పటి వరకు 5190 స్వయం సహాయక మహిళా సంఘలకు ఆసరా సొమ్ము జమచేయాల్సి ఉంది. అయితే కొన్ని సంఘాలకు సొమ్ము జమ చేయకపోయినా పడినట్లు బలవంతంగా ఒప్పిస్తున్నారు. ఇదేం పద్ధతి అంటూ మహిళలు తిరగపడుతున్నారు. అమౌంట్ పడకనే అకౌంట్లలోకి పడిందని ఎలా చెప్పేదంటూ సిబ్బంది, మహిళలు ప్రశ్నిస్తుండడం అధికారపార్టీ నేతలకు మింగుడపడడం లేదు. ఇప్పటికీ 5190 స్వయం సహాయక మహిళా సంఘాలలోని 50వేల మందికి పైగా సభ్యులకు రూ.41.36కోట్లు నిధులు చెల్లించాల్సి ఉంది. జనవరి 23న ఉరవకొండలో సీఎం జగన్ 30వేల సంఘాలలోని 3లక్షల మంది సభ్యులకుగాను రూ.236కోట్లు నిధుల చెల్లింపునకు బటన్ నొక్కారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా 70శాతం మందికి మాత్రమే నగదు జమచేశారు. మిగిలిన సభ్యులకు ఎప్పుడు పడుతుందో చెప్పలేని పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆసరా సొమ్ము ఆలస్యం చేయడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు చెక్ అందజేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

అర్హులందరికీ ఆసరా సొమ్ము



ఆసరా సొమ్ముకు సంబంధించి అర్హులైన స్వయం సహాయక సంఘాల మహిళలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. వైఎస్సార్ ఆసరా పథకం కింద అర్హులందరికీ సొమ్ము చెల్లిస్తాం. పలు సమస్యల కారణంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమకావడానికి ఆలస్యమవుతోంది. విడతల వారిగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తారు. ఎవరికీ ఎటువంటి సందేహం వద్దు.

- నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

హోరాహోరీగా రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నీ విజేతలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 7: స్థానిక సంగమేష్ నగర్‌లోని రఘు సైనిక్ స్కూల్‌లో ఏపీ రాష్ట్ర ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్-2024ను ఆదివారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 200 మంది ఇందులో పాల్గొన్నారు. ఈ పోటీల్లో కుషాల్ ప్రథమ, ఆఫ్రీదీ ఖాన్ ద్వితీయ, దుర్గాప్రసాద్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్, లోకేష్, టోర్న మెంటర్ ఆర్గనైజర్ రామసుబ్బారెడ్డి, ఏ1 చెస్ అకాడమీ వ్యవస్థాపకురాలు తుల సమ్మ, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు నగదు బహుమతి, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ మెహరాజ్, టోర్నీ డైరెక్టర కిశోర్‌నాయుడు, కోఆర్డినేటర్ గోవిందరాజులు పాల్గొన్నారు.

మామిడి తోటకు నిప్పు



కాలిపోయిన డ్రిప్‌ను చూపుతున్న రైతు రమణ

శింగనమల, ఏప్రిల్ 7: శింగనమల గ్రామానికి చెందిన రైతు ఎల్.రమణకు వెస్టునరసాపురం రెవెన్యూలో మామిడి తోట ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి నిప్పుపెట్టారు. దీంతో ఆ తోటలోని 300పైగా మామిడి చెట్లు, డ్రిప్ పరికరాలు కాలిబూడియ్యాయి. తనకు రూ.4 లక్షలు వరకు నష్టం జరిగిందని రమణ వాపోతున్నాడు. తనను ప్రభుత్వమే నష్టపరిహారం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

శిల్పారామంలో రేపు సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 7: పండుగ పర్వదినాలను పురస్కరించుకుని శిల్పారామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 5గంటలకు పంచాగం శ్రవణం, 6 గంటల నుంచి శ్రీనృత్య కళానిలయం, నృత్య గురువు సంధ్యామూర్తి శిష్యబృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శలుంటాయన్నారు. శుక్రవారం రంజాన్ పండుగ సందర్భంగా ధర్మవరానికి చెందిన మానస నృత్య కళాకేంద్రం ఆధ్వర్యంలో పాశ్చాత్య నృత్య ప్రదర్శలుంటాయన్నారు. 17న శ్రీరామ నవమిని పుస్కరించుకుని శ్రీగురుకృపా సంగీత నిత్య కళానికేతన్ నృత్య గురువు పట్నం శివప్రసాద్ శిష్య బృందంజానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొండయ్య

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐఎంఏ హాల్‌లో రౌండు టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యను పరిరక్షించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్యం నేడు ఒక వ్యాపారంగా మారిందని, సంపాదించిన సొమ్ములో 80 శాతం వైద్యం కోసమే ఖర్చు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వాలు వైద్యరంగానికి ప్రాధాన్యతనిచ్చి అధిక నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్‌రావు, అభిషేక్‌రెడ్డి, వీరభద్రయ్య, రాజమోహన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్, ఎరువుల దుకాణాల్లో చోరీ

నార్పల, ఏప్రిల్ 7: స్థానిక గూగూడు రోడ్డులోని సెల్‌ఫోన్, కిరాణా దుకాణాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. గవ్వల మనోహర్‌కు చెందిన సెల్‌ఫోన్ సర్వీసింగ్ దుకాణం తాళాలు బద్దలు కొట్టి దుకాణంలోని సెల్‌ఫోన్లు, బ్లూటూత్‌లు, తదితర సుమారు రూ. 30 వేల విలువైన వస్తువులు తీసుకెళ్లారు. అలాగే అంగడి శీనకు చెందిన కిరాణా దుకాణంలో సుమారు రూ. 10 వేల విలువైన వస్తువులను చోరీ చేశారు. బాధితులు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాలను ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు.

హానిమన్‌కు నివాళి



హానిమన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హోమియో వైద్యులు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7: హోమియో వైద్య పితామహుడు హానిమన్ జయంతి వేడుకలను ఆదివారం హోమియో వైద్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని కమలానగర్‌లోని సద్గురు శ్రీ రాజ్యలక్ష్మమ్మ ప్రవణలీల ఆధ్యాత్మిక ఆశ్రమంలో ఈ వేడుకలను చేపట్టారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యుల సంఘం నాయకులు పోగుల కుమారయ్య, నాగేంద్ర, ప్రతిమ, శాంతిప్రియ, మురళీకృష్ణ, మాలిక్, సరుచూరు సూర్యప్రకాష్, రవీంద్రారెడ్డి, విఠల్, మారుతి, రామయ్య పాల్గొన్నారు.

రియా వైద్య శిబిరానికి భారీ స్పందన

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7: నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రియా కార్పొరేట్ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని ఎండీ మోదుపల్లి లక్ష్మీప్రసాద్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురష్కరించుకొని.. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం ఆదివారంతో ముగిసిందన్నారు. డాక్టర్లు మోదుపల్లి ఉదయ్‌కుమార్, దేవినేని గీత ఇతర సిబ్బంది శిబిరంలో రోగులకు వైద్య చికిత్సలు అందించారన్నారు. రూ. 2,500 విలువచేసే వివిధ రకాల వైద్య పరీక్షలను కేవలం రూ599 లకే చేయించామన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

టిక్కెట్ ఎంతకొక్కొన్నావ్ 'అనంతా'..!

● నీ పార్టీ నాయకులే నీపై జగన్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు ● నేను పక్కా లోకల్ : దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 7: 'మూడు దశాబ్దాలుగా ఎన్నికల్లో నీవు పోటీ చేస్తున్నావ్... ప్రతిసారి నువ్వు ఎంత డబ్బులిచ్చి టికెట్ కొంటున్నావ్.. వైసీపీలోనే సీటుకు డబ్బులిచ్చే సంస్కృతి ఉంది. టీడీపీ లో అభ్యర్థి సామర్థ్యాలను పరిగణలోకి తీసుకొని టికెట్ కేటాయిస్తారు. ఈ విషయాన్ని గుర్తుంచుకో... ' అని అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి హితవు పలికారు.



ఐక్యత చాటుతున్న జనసేన, టీడీపీ నేతలు

ఆదివారం స్థానిక 34వ డివిజన్ పరిధి లోని మారుతీ నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ' టీడీపీలో చిన్న చిన్న సమస్యలున్న మాట వాస్తవమే.. వైసీపీ నాయకులు నీపై ఏకంగా జగన్‌కే ఫిర్యాదులు చేశారు. అది వాస్తవం కాదా.. నన్ను స్థానికేతరుడని వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తుండటం విడ్డూరంగా ఉంది. నేను పదేళ్లుగా రాం నగర్‌లోనే ఉంటున్నా. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న శంకర్‌నారాయణ, శాంతమ్మ స్థానికులా..?.. కూటమి నాయకులు, కార్యకర్తలు నాకు అండగా ఉన్నారు. ఈ సారి ఎన్నికల్లో గెలుపు నాదే...' అని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీ ధర్, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్, నాయకులు బుగ్గయ్య చౌదరి, సుధాకర్ నాయుడు, కొండవీటి భావన, రాజారావు, రాయల్ మురళీ, ఫయాజ్, కూచి హరి, పోతుల లక్ష్మీనరసింహులు, లింగారెడ్డి, గుత్తా ధనుం జయనాయుడు, వెంకటప్ప, కృష్ణకుమార్, గోళ్ల సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, గంగవరం బుజ్జి, శ్రీధర్ రాయల్ పాల్గొన్నారు.

పలువురితో దగ్గుబాటి భేటీ

దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పలువురు టీడీపీ నాయకులను కలిశారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, టీడీపీ నాయకులు రామయ్యచౌదరిలను అనంతపురంలోని వారి నివాసాల్లో ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. తన విజయం కోసం సహాయ సహకారాలు అందించాలని కోరారు.

దగ్గుబాటిని గెలిపించుకుంటాం : జనసైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్ : సమన్వయంతో పనిచేసి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను గెలిపించుకుంటామని జనసేన నేతలు స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని భూపాళం ఫంక్షన్ హాల్‌లో జనసేన పార్టీ జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందులో ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు జయరామిరెడ్డి పాల్గొన్నారు. జనసేన నేతలు మాట్లాడుతూ... తమకు పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మాటే శిరోధార్యమని, సమన్వయంతో ముందు కెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గుండాల మురళి, జిల్లా ప్రచార కార్యదర్శి అంగడి చలపతి, ఎన్నికల నిర్వహణ రాయలసీమ కన్వీనర్ గల్లా హర్ష, జిల్లా కమిటీ సభ్యుడు సంజీవరాయుడు, కొన చంద్ర, జయమ్మ, నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక...

అనంతపురం రూరల్ మండలం నారాయణపురం గ్రామ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, నగరంలోని 26, 42 డివిజన్ల పరిధిలోని సుమారు 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అనంతపురంలోని దగ్గుబాటి స్వగృహంలో ఆయన సమక్షంలో ఆ కుంటుంబసభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

'పేరూరు'కు నీళ్లివ్వని ప్రకాశ్‌రెడ్డిని నిలదీయండి

రాప్తాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత



తిమ్మాపురం ప్రచారంలో మాట్లాడుతున్న పరిటాల సునీత

రామగిరి, ఏప్రిల్ 7: పేరూరు డ్యాంకు నీళ్ల ఇవ్వని ప్రకాశ్‌రెడ్డి గ్రామాల్లోకి వచ్చినప్పుడు నిలదీయాలని మాజీ మంత్రి పరిటాల సునీత సూచించారు. ఆదివారం సాయంత్రం తిమ్మాపురం, మంగాపురం, ఎంసీపల్లి, గరిమేకలపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన ఆమె మాట్లాడారు. పేరూరు డ్యాంకు నీరు తీసుకురావడమే తొలి లక్ష్యమంటూ ప్రకాశ్‌రెడ్డి ప్రజలకు మోసం చేశాడన్నారు. రూ.800 కోట్లతో పేరూరు జలాశయానికి నీటిని తీసుకొచ్చే పనులు మొదలు పెడితే... సైకో ఎమ్మెల్యే వచ్చిన తరువాత ఒక్క అడుగు పనులు చేయలేదని విమర్శించారు. ఒక రైతుబిడ్డ అయితే ప్రకాశ్‌రెడ్డి నీటి గురించి ఆలోచించేవాడని పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు, వారి సోదరులకు, కుటుంబసభ్యులకు ఎంత సేపు దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రూ. కోటితో నీటిని తీసుకోస్తానని ప్రగల్భాలు పలికి వర్షంతో నీరు వస్తే అది తానేతెచ్చానని గొప్పలు చెప్పుకున్నారన్నారు. ఈ ప్రచారంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జయహో బీసీ

అనంతపురంరూరల్ : అనంతపురంరూరల్ మండలంలోని ఆకుతోటపల్లిలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిటాల సునీత గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానమని నాయకులు పేర్కొన్నారు. ఇందులో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, ఎంపీపీ మాధవి, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయిరఘు, ఉపాధ్యక్షులు గంగాధర్‌రెడ్డి హాజరయ్యారు.

ఆత్మకూరు : స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల బీసీ నాయకులు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిటాల సునీత అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్, నాయకులు వేణుగోపాల్, మనోరంజన్, ప్రతాప్, సుబ్బర హరి పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఆత్మకూరు మసీదుల్లో సుమారు 200 మంది ముస్లింలకు స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, మండల ఇన్‌చార్జి బాలాజి, నాయకులు రమేష్ నాయుడు, అనీల్ చౌదరి, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

మండల కన్వీనర్, మండల పార్టీ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. పీ. కొత్తపల్లి, వై. కొత్తపల్లి, కుర్లపల్లి గ్రామాల నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

రామగిరి : మండలం కొండాపురం పంచాయతీలోని నాలుగు గ్రామాలకు చెందిన, మాదాపురం, రామగిరి పంచాయతీలోని వైసీపీకి చెందిన 30 కుటుంబాలు పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఆదివారం వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

నేడు రాప్తాడులో జయహో బీసీ

రాప్తాడు : స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు. బీసీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీలోకి స్వచ్ఛందంగా చేరికలు

శింగనమల కూటమి అభ్యర్థి బండారు శావ్రణిశ్రీ



బొమ్మలాటపల్లిలో టీడీపీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 7: వైసీపీ పాలనతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే విగిసి పోయారని, దీంతో వారు స్వచ్ఛందంగా టీడీపీ కూటమిలో చేరుతున్నారని శింగనమల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండలంలోని బొమ్మలాటపల్లి గ్రామంలో వైసీపీ నుంచి 250 మంది టీడీపీలోకి చేరారు. వారిని బండారు శ్రావణిశ్రీ , ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఎమ్మెల్యే నిత్యం అవినీతి, అక్రమాలతో నియోజకవర్గ ప్రజల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. వైసీపీ పని అయిపోయిందని, అధికారంలోకి వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పసువుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, డేగల క్రిష్ణమూర్తి, కన్వీనర్ అశోక్, చితంబరి దొర, టీడీపీ నేతలు వెంకటరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక

గార్లదిన్నె : శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గార్లదిన్నెలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే మర్తాడులో 20 మంది యువకులు టీడీపీలో చేరారు. బండారు శ్రావణి గెలుపు కోసం కృషి చేస్తామని వారు తెలిపారు.

జూదం ఆడుతూ పట్టుబడిన వైసీపీ యువనాయకుడు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులో జూదం ఆడుతూ మండల వైసీపీకి చెందిన మండల యూత్ నాయకుడు విశ్వనాథ్‌రెడ్డితో పాటు మరికొంతమంది అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామ శివారులో ఆదివారం జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి విశ్వనాథ్‌రెడ్డి, కెంచప్ప, పెద్దన్న, రవిలతోపాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 10,630 నగదును, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వివరించారు.

చీరల దొంగలు అరెస్ట్

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 7: పట్టణంలోని జయనగర్‌కాలనీ 5వరోడ్డులో ఉన్న కిషోర్‌కుమార్‌రెడ్డికి చెందిన చీరల దుకాణంలో ఈనెల 6న జరిగిన చోరీకి సంబంధించి ఐదుగురిని ఆదివారం అరెస్ట్‌చేసినట్లు పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. దుకాణానికి వచ్చిన ఐదుగురు మహిళలు షాపు యజమానిని డైవర్ట్‌చేసి 12చీరలను దొంగతనం చేశారన్నారు. వీటివిలువ రూ.60వేలు ఉంటుందన్నారు. సీసీ పుటేజీలను పరిశీలించగా వీరు కర్నూలుటౌన్‌కు చెందిన పసుల సరోజమ్మ అలియాస్ నల్లబోతుల సరోజమ్మ, నల్లబోతుల రంగమ్మ, విజయలక్ష్మి, పసుల సుజాత, అరుణజ్యోతిలుగా గుర్తించామన్నారు. సీఐ మురళీకృష్ణకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం చుక్కలూరు బైపాస్‌రోడ్డులో వీరిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 12 చీరలను రికవరీ చేశామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా హింగులాజ్ మాత జయంతి

పామిడి, ఏప్రిల్ 7: పట్టణంలోని రంగసుభే ఫిర్కా భగవాన్‌దాస్ విఠోబాస్వామి దేవాలయంలో హింగులాజ్ మాత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణయ్య, రంగసుభే ఫిర్కా సమాజ్ అధ్యక్షులు టీటీ నాగభూషణం, ఉత్తర్కర్ మంజునాథరావు, మహిళా మండలి సభ్యులు, అర్చకులు సూర్యనారాయణస్వామి, తేజస్వామి పాల్గొన్నారు.



అలంకరణలో అమ్మవారు

పూర్వ విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నార్పల, ఏప్రిల్ 7: తమతోపాటు కలసి చదువుకొని ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ముగ్గురు మిత్రులకు తోటి వారు ఆదివారం ఆర్థిక సహాయం చేశారు. నార్పలలో 1992 పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఇటీవల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎవరి స్థోమత కొద్ది వారు డబ్బులు పోగు చేసుకున్నారు. ఆ డబ్బులు తమ బ్యాచ్‌లో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సహచర మిత్రులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆదివారం మిత్రులందరు మరోసారి సమావేశమయ్యారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహచర మిత్రులు పుల్లయ్యకు రూ.25 వేలు, కుళ్లాయిబాబుకు రూ.25 వేలు, షమీంకు రూ.25 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, గవ్వల సుబ్బయ్య, శ్రీధర్, సోమనాథ్ బాబు, మల్లెల శివయ్య, అమీర్ బాష, ప్రభాకర్, డోక్కా శ్రీధర్, టోపివలి, రసూల్‌ఖాన్, కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, తిరుపాల్, శ్రీరాములు, రామానాయుడు, నాగరాజు, రామిరెడ్డి, శివారెడ్డి, ఖాదర్‌ఖాన్, రాము, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు సోహానా



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 7: నగరానికి చెందిన బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి సోహానా ఇటీవల పాలకొల్లులో నిర్వహించిన ఆరో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొని.. మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. దీంతో సోహానా మంగళవారం నుంచి పాండిచ్చేరిలో నిర్వహించే 38వ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాలికల జట్టు తరఫున పాల్గొనబోతోంది.

జాతీయ చెస్ పోటీల్లో హంపాపురం బాలిక ప్రతిభ



రాప్తాడు, ఏప్రిల్ 7: మండలంలోని హంపాపురం గ్రామానికి చెందిన మోదుపల్లి దీక్షిత ఈ నెల 5న హిమాచల్‌ప్రదేశ్ ధర్మశాలలో నిర్వహించిన జాతీయ చెస్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. హిమాచల్‌ప్రదేశ్ చెస్ ఫెడరేషన్ దీక్షితకు కప్ అందజేసి సన్మానించింది. దీక్షిత తల్లిదండ్రులు మోదుపల్లి షేషాద్రినాయుడు, రజినిని స్థానికులు అభినందించారు.

జూదరుల అరెస్ట్

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని బసంపల్లి గ్రామ శివారులో ఓ పేకాట స్థావరంపై ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టుచేసి, వారి వద్ద నుంచి రూ.8300ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వాహనాల తనిఖీ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని ఎన్ఎస్‌గేటులో ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. రామగిరికి వెళ్లే రోడ్డులో ప్రతి వాహనాన్ని తనిఖీచేశారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలని ఎస్ఐ సూచించారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని పరిమితికి మించి నగదును తీసుకెళ్లరాదని సూచించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

వేదావతి హగరి ప్రాంతంలో చెలరేగుతున్న అక్రమార్కులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7: వేదావతి హగరి ప్రాంతం ఇసుక అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. హగరి పరీవాహక ప్రాంతం కావడంతో ఇసుక ఎక్కువగా లభిస్తుంది. అధికారంలో ఉన్నన్ని రోజులు దోచేసుకోవాలని కొందరు నాయకులు ఇసుకను తవ్వి అక్రమ రవాణా చేస్తున్నారు. యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుకను తరలించుకొని పోతుండడంతో పరివాహక ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. బోర్ల నుంచి నీరు రావడం లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా సంబంధిత అధికారులు చేయడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇసుకాసురులు పట్టపగలే నిర్భయంగా రవాణా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పోలీసుల నిఘా కొరవడడంతో ఇసుక అక్రమంగా తరలిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు.



ఇసుకను ట్రాక్టర్‌లోకి నింపుతున్న దృశ్యం

పశువుల సంత ఆదాయం రూ.3.58 లక్షలు

అనంతపురం రూరల్ : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,58,585 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,76,225, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,82,360 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

గార్లదిన్నె : మండలంలోని పెనకచెర్లలో మాలమారెన్న అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. శింగనమల నియోజకవర్గం టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి మృతుని కుటుంబానికి స్థానిక టీడీపీ నాయకుల ద్వారా రూ. 10వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చితంబరప్ప, బండారు ఓబిలేసు పాల్గొన్నారు.

సాగు, తాగునీరిచ్చి మీ కలలను నెరవేరుస్తా


సమావేశానికి హాజరైన వారికి అభివాదం చేస్తున్న అమిలినేని సురేంద్రబాబు


విక్టరీ గుర్తు చూపుతున్న అమిలినేని

కళ్యాణదుర్గంలో టీడీపీ గెలిస్తేనే అభివృద్ధి
ఒక్కచాన్స్ ఇవ్వండి.. అభివృద్ధి ఎలా ఉంటుందో చూపుతా
టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 7: నియోజకవర్గానికి సాగు, తాగునీరిచ్చి కళ్యాణదుర్గం ప్రజల కలనను నెరవేర్చడమే తన మొదటి కర్తవ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆదివారం ప్రజావేదిక వద్ద నియోజకవర్గం లోని వడ్డెర్ల కులస్తులతో భారీఎత్తున ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమిలినేని మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే రెండున్నరేళ్లలో నియోజకవర్గంలోని 114 చెరువులకు తాగు, సాగునీరు అందిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఒక్కచాన్స్ ఇవ్వండి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏంటో మీ కళ్లకు కట్టినట్లు చూపుతానన్నారు. గ్రామీణ ప్రాంతాలకు సరియైన రోడ్డు సౌకర్యాలు లేక గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అలాంటి గ్రామీణ ప్రాంతాలను గుర్తించి తారు రోడ్లు వేయించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. శెట్టూరు మండల పరిధిలోని అడవి గొల్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, వైసీపీ పార్టీల నుంచి 19 కుటుంబాలు టీడీపీలోకి చేరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా వుంటూ అన్ని విధాలా ఆదుకుంటామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు అవినాష్ హామీ ఇచ్చారు. ఆదివారం కళ్యాణదుర్గం మండల పరిధిలోని మల్లిపల్లికు చెందిన టీడీపీ కార్యకర్త గంగన్న అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యకర్తకు నివాళి

కుందుర్పి: మండల పరిధిలోని మలయనూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గంగమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజ గ్రామానికి వెళ్లి ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీ అధికారంలోకి రావాలి

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని ఎస్ కోనాపురం గ్రామంలో అమిలినేని సురేంద్రబాబు సోదరుడు అమిలినేని యర్రిస్వామి, సోదరి పద్మావతి, కుమార్తె చరిత, కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, అమిలినేని సురేంద్రబాబును గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో మండల టీడీపీ కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, విరుపాక్షి, యర్రిస్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

ఉరవకొండ, ఏప్రిల్ 7: ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరి సహకారం అవసరమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎన్నికలు అతి పెద్ద పండగ, దేశానికి గర్వకారణం అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు స్వీప్ ఆకృతి లో కూర్చున్నారు. అందరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆర్వో, జేసీ కేతన్‌గార్గ్, ఈఆర్వో శిరీషతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూం, కంట్రోల్‌రూంను పరిశీలించారు. అలాగే పీవో, ఏపీవోల శిక్షణ తరగతులను పరిశీలించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేక ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ నెల12వ తేదీ నుంచి ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ తర్వాత ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలకు వస్తాయన్నారు. అలాగే పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమావేశమయ్యారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే వజ్రకరూరు మండలంలో కొనకొండ్ల గ్రామంలో ఆదివారం పోలీస్ కవాతులో కలెక్టర్, జేసీ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. ఓటర్లతో మాట్లాడారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలన్నారు.

పొరపాట్లకు తావివ్వకండి: కలెక్టర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సర్వేపల్లిరాధకృష్ణ మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన సెక్టోరియల్ అధికారులు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలన్నారు. ఎన్నికల్లో అలసత్వం వహించరాదన్నారు.

సమన్వయంతో ఎన్నికలు నిర్వహించాలి
రిటర్నింగ్ అధికారి రాణి సుష్మిత

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 7: ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా పనిచేయాలని రిటర్నింగ్ అధికారి రాణి సుష్మిత అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌విజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సన్నద్ధతకు సంబంధిత సెక్టోరియల్ అధికారులు, తహసీల్దార్లు, పోలీసు అధికారులతో డీఎస్పీ శ్రీనివాసులుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి సుష్మిత మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను, సూచనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో లోపాలు వుండకూడదని, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అన్ని శాఖల అధికారులు కలసికట్టుగా విధులు నిర్వహించాలన్నారు. పకడ్బందీగా విధులను నిర్వర్తించాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అమలు చేయాలన్నారు.


మాట్లాడుతున్న రాణి సుష్మిత

వైసీపీ నాయకులను తరిమికొడదాం
- అంబికా లక్ష్మీనారాయణ, గుమ్మనూరు జయరాం


మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 7: వైసీపీ నాయకులను ఎన్నికల్లో ఓడించి తరిమికొడదామని టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పట్టణంలోని 18వ వార్డు ఇన్‌చార్జి తలారి సరోజమ్మ ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగన్‌కు ఒకసారి ఓటేసిన పాపానికి శిక్షను అనుభవిస్తున్నామన్నారు. గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అండదండలతో నియోజకవర్గంలో అడుగడుగునా పేకాట క్లబ్బులు నడుస్తున్నాయన్నారు. సమావేశంలో వైసీపీకి చెందిన సరేశ్, మహీంద్ర, నాగేశ్, మంజుల, నాగలక్ష్మి, రామాంజనేయులుతో పాటు 60 కుటుంబాలవారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, కేసీ హరి, తలారి మస్తానప్ప, ముష్టూరు తిమ్మప్ప, శివ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 16వవార్డు టీడీపీ కౌన్సిలర్లు ఎన్‌ఈ మూర్తిగౌడ్, ఎన్‌ఈ వరలక్ష్మి, ఎన్‌ఈ రమేష్‌గౌడ్‌లతో ఆదివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం సమావేశం అయ్యారు. ఎన్నికల్లో మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ పత్తిహిమబిందు, బీఎస్ కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు హరిహరనాథ్, జనసేన నాయకుడు, వాసిగిరిమణికంఠ పాల్గొన్నారు.

పామిడి: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని గుమ్మనూరు నారాయణ కోరారు. పట్టణంలోని 4, 9వ వార్డులో ఆదివారం పర్యటించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు బొమ్మా మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

అండగా ఉంటాం...!

విశ్వనాథ్(42)అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న గుమ్మనూరు నారాయణ ఆ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు.

గుత్తిరూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో ఆదివారం వైసీపీ నుంచి టీడీపీలోకి గుమ్మనూరు జయరాం కుమారుడు ఈశ్వర్, సోదరుడు నారాయణ ఆధ్వర్యంలో సంజీవరాజు, సురదర్శన్, మాజీ సర్పంచ్ రంగన్న, ఆదినారాయణ మల్లయ్య రామయ్యతో సహ మరో 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బర్దీవలి, సర్పంచు భరత్, ఎంపీటీసీలు జింకల నారాయణ స్వామి, ధనుంజయ్య పాల్గొన్నారు.

మైనార్టీలంటే జగన్‌కు ద్వేషం: అంబికా

గుంతకల్లు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలంటే జగన్‌కు ద్వేషమని అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఉదయం పట్టణంలోని వైసీపీ నాయకుడు ముష్టూరు తిమ్మప్ప, ముష్టూరు భాస్కర్‌ను కలసి టీడీపీలోకి రావాలని సూచించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్నివర్గాలకు అండగా ఉంటుందన్నారు.

గుంతకల్లుటౌన్: మండలంలోని కసాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణ స్వామి వారిని ఆదివారం అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు తలారి పరశురాముడు, తలారి శకుంతల, రామ్‌చరణ్‌తేజ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
వేదావతి హగరి ప్రాంతంలో చెలరేగుతున్న అక్రమార్కులు


ఇసుకను ట్రాక్టర్‌లోకి నింపుతున్న దృశ్యం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7: వేదావతి హగరి ప్రాంతం ఇసుక అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. హగరి పరీవాహక ప్రాంతం కావడంతో ఇసుక ఎక్కువగా లభిస్తుంది. అధికారంలో ఉన్నన్ని రోజులు దోచేసుకోవాలని కొందరు నాయకులు ఇసుకను తవ్వి అక్రమ రవాణా చేస్తున్నారు. యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుకను తరలించుకొని పోతుండడంతో పరివాహక ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. బోర్ల నుంచి నీరు రావడం లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా సంబంధిత అధికారులు చేయడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇసుకాసురులు పట్టపగలే నిర్భయంగా రవాణా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పోలీసుల నిఘా కొరవడడంతో ఇసుక అక్రమంగా తరలిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు.


డీ. హీరేహాళ్ మండలంలోని పులకుర్తి, వసగుడ్డం గ్రామాల్లో ఆదివారం టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లసర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభంజనం
టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు


ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఏప్రిల్ 7: రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభంజనం కనిపిస్తోందని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం బెంగుళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో కాలవ భరత్ నాయకత్వంలో పార్టీ కార్యాలయం వద్ద నుంచి లక్ష్మీబజార్, పాతబస్టాండ్, వినాయకసర్కిల్, బళ్లారిరోడ్డు, శాంతినగర్ వరకు ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించడానికి అన్ని వర్గాల ప్రజలు సమాయత్తం అయ్యారన్నారు.

45 కుటుంబాలు టీడీపీలో చేరిక

పట్టణంలోని 25వ వార్డుకు చెందిన 45 వైసీపీ కుటుంబాలు ఆదివారం వార్డు ఇన్‌చార్జి ఆటో వెంకటేశులు, యాల్పుల వెంకటేశులు నాయకత్వంలో కాలవ సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన మల్లికార్జునచారి, రుద్రప్ప, తులసమ్మ, యశ్వంత్, వన్నూరుస్వామి, గంగాధర, కుళ్లాయి, పురుషోత్తం, మారుతి, రాము, నాగేంద్ర, నరసింహులు, పుష్పలతో పాటు మిగిలిన వారు పార్టీలో చేరారు.

ఇఫ్తార్‌విందుకు హాజరు

కణేకల్లు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందుకు కాలవ శ్రీనివాసులు హాజరయ్యారు. స్థానిక జామియా మసీదు వద్ద ముస్లింలకు ఆయన భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, షేక్‌ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అవ్వ, తాతలకు రూ. నాలుగు వేలు ఫించన్ అమలు చేస్తామని కాలవ భరత్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గ్రామదట్ల గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచులు, అశోక్, రాజశేఖర్‌రెడ్డి, మల్లేశప్ప, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి: ఎమ్మెల్యే కేశవ్


ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ, ఏప్రిల్ 7: టీడీపీ హయాంలోనే ఉరవకొండలో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలోని జెండాకట్ట, ఉల్లిగడ్డ వీధి, శాంతి నగర్, సాయినగర్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, విజయ్‌భాస్కర్, మారెన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు

బెళుగుప్ప: మండల కేంద్రమైన బెళుగుప్పకు చెందిన 11 మంది వైసీపీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తిప్పయ్య, బలిజ భాస్కర్, పద్మారవి, నాగరాజు, సురేష్, సుధాకర్, కురుబ రవి, రాజు, రుద్ర, చంద్ర, విశ్వనాథలకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక నాయకులు, మాజీ సర్పంచ్ వన్నూరుస్వామి, ఎంపీటీసీ కంచిరాముడు, ఫిట్టర్ శివ పాల్గొన్నారు.

ఉరవకొండ: రాబోయే ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటములు అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన జనసేన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ అన్ని వర్గాలు ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, విజయ్‌భాస్కర్, గోవిందు, జనసేన ఇన్‌చార్జి గౌతమ్, మండల కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు. విడపనకల్లు మండలంలోని జీ.మల్లాపురం, హావళిగి గ్రామాల్లో ఎమ్మెల్యే తనయుడు విక్రమ్‌సింహా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేశవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. మండల కన్వీనర్ మారయ్య, టీడీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, తిప్పయ్య, తిమ్మప్ప పాల్గొన్నారు.

బెళుగుప్ప: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విజయసింహా అన్నారు. ఆదివారం మండలంలోని నక్కలపల్లి, యలగలవంక తండా, బ్రాహ్మణపల్లి తండాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం చేశారు.

చంద్రబాబును సీఎం చేద్దాం: దివాకర్ రెడ్డి


బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న జేసీ దివాకర్ రెడ్డి

యాడికి, ఏప్రిల్ 7: సమష్టికృషితో చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకుందామని టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం యాడికిలో విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా ఆలోచించి ఓటువేయాలని సూచించారు. ఆయన వెంట క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, జనసేన మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ గంగాధర్, టీడీపీ నాయకులు తిరంపురం నీలకంఠ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి: జేసీపీఆర్

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 7: పట్టణంలోని యల్లనూరురోడ్డులో ఉన్న పలు కాలనీల్లో ఆదివారం టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు.

100మంది వైసీపీ నుంచి టీడీపీలోకి...

స్థానిక నివాసంలో ఆదివారం టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో మండలంలోని పలు గ్రామాల నుంచి 100మంది వైసీపీ మద్దతుదారులు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ నాయకులు వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జేసీ దివాకర్‌రెడ్డిని వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు.


మహిళతో మాట్లాడుతున్న జేసీపీఆర్

ఘనంగా హింగులాజ్ మాత జయంతి


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పామిడి, ఏప్రిల్ 7: పట్టణంలోని రంగ సుభే ఫిర్కా భగవాన్‌దాస్ విఠోబా స్వామి దేవాలయంలో హింగులాజ్ మాత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణయ్య, రంగసుభే ఫిర్కా సమాజ్ అధ్యక్షులు టీటీ నాగభూషణం, ఉత్తర్కర్ మంజునాథరావు, మహిళా మండలి సభ్యులు, అర్చకులు సూర్యనారాయణస్వామి, తేజస్వామి పాల్గొన్నారు.

రాయదుర్గంలో చోరీ

రాయదుర్గం, ఏప్రిల్ 7: పట్టణంలోని పార్వతినగర్‌లో నివాసం ఉండే సిద్ధిక్ ఇంట్లో ఆదివారం ఉదయం చోరీ జరిగింది. ప్రార్థన నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉందని, బీరువాలో ఉంచిన రూ. 35 వేలు నగదు, మూడు బంగారు ఉంగరాలను చోరీకి గురయ్యాయన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

35 మద్యం బాటిళ్లు స్వాధీనం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 7: మండలంలోని సజ్జలదిన్నె గ్రామానికి చెందిన రాజమ్మ నుంచి ఆదివారం 35మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్ఐ సాగర్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి రాజమ్మను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బొలెరో, ద్విచక్రవాహనం ఢీ

పెద్దపప్పూరు, ఏప్రిల్ 7: మండలంలోని ముచ్చుకోట గ్రామసమీపంలో ప్రధాన రహదారిపై బొలెరో, ద్విచక్రవాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన కంబగిరి, కుమారుడు కల్యాణ్‌రాం, కుమార్తె కస్తూరి గాయపడ్డారు. కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.

జూదం ఆడుతూ పట్టుబడిన వైసీపీ యువనాయకుడు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులో జూదం ఆడుతూ మండల వైసీపీకి చెందిన మండల యూత్ నాయకుడు విశ్వనాథ్‌రెడ్డితో పాటు మరికొంతమంది అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామ శివారులో ఆదివారం జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి విశ్వనాథ్‌రెడ్డి, కెంచప్ప, పెద్దన్న, రవిలతోపాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 10,630 నగదును, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వివరించారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయండి
- సిబ్బందికి ఎస్పీ అమిత్‌బర్దార్ ఆదేశం


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఏదీ అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేయాలని ఎస్పీ అమిత్‌బర్దార్ సిబ్బందిని ఆదేశించారు. డొనేకల్లు, విడపనకల్లు చెక్‌పోస్టలను ఆదివారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టులోని రికార్డులను పరిశీలించారు. కర్ణాటక నుంచి మద్యం డబ్బు ఎన్నికల తాయిలాలు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటకకు చెందిన చేలగుర్కి చెక్‌పోస్టును సందర్శించారు. అదేవిధంగా పాల్తూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సమయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు ఖాజాహుసేన్, హుసేన్‌బాషా పాల్గొన్నారు.

చీరల దొంగలు అరెస్ట్

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 7: పట్టణంలోని జయనగర్‌కాలనీ 5వరోడ్డులో ఉన్న కిషోర్‌కుమార్‌రెడ్డికి చెందిన చీరల దుకాణంలో ఈనెల 6న జరిగిన చోరీకి సంబంధించి ఐదుగురిని ఆదివారం అరెస్ట్‌చేసినట్లు పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. దుకాణానికి వచ్చిన ఐదుగురు మహిళలు షాపు యజమానిని డైవర్ట్‌చేసి 12చీరలను దొంగతనం చేశారన్నారు. వీటివిలువ రూ.60వేలు ఉంటుందన్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా వీరు కర్నూలుటౌన్‌కు చెందిన పసుల సరోజమ్మ అలియాస్ నల్లబోతుల సరోజమ్మ, నల్లబోతుల రంగమ్మ, విజయలక్ష్మి, పసుల సుజాత, అరుణజ్యోతిలుగా గుర్తించామన్నారు. సీఐ మురళీకృష్ణకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం చుక్కలూరు బైపాస్‌రోడ్డులో వీరిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 12 చీరలను రికవరీ చేశామని ఎస్ఐ తెలిపారు.

మైనార్టీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7: మైనార్టీలకు సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని టీడీపీ కొత్తపల్లి సోదరుల ఆధ్వర్యంలో ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, తిమ్మరాజు, మాజీ డైరెక్టర్ మహేంద్ర, కే సూరి, పయ్యావుల నాగరాజు పాల్గొన్నారు.


బొమ్మనహాళ్ మండలంలోని ఎల్‌బీ నగర్‌లో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు మాలపాటి ధనుంజయ, ముల్లంగి నారాయణస్వామి, ఎస్‌పీ నాగరాజుస్వామి, పయ్యావుల మోహన్ తదితరులు